నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, శుక్రవారం 15 మార్చి 2024 | NIZAMABAD

రంజాన్ వేళలు
శుక్రవారం
ఇఫ్తార్ - 6:34
శనివారం
సహర్ - 5:14

హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ సరోజనమ్మకు విశిష్ట మహిళా పురస్కారంతోపాటు రూ. లక్ష చెక్కును రాష్ట్ర మంత్రి సీతక్క ప్రదానం చేశారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

కామారెడ్డి, మార్చి 14: వేసవి దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నుంచి ఒంటిపూట బడులు నిర్వహించనున్నట్లు డీఈవో రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలలను ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించాలని సూచించారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఓడినవాళ్లదే హవా

నియోజకవర్గాల్లో అనధికార ఎమ్మెల్యేలు!

- వివాదాస్పదంగా మారిన కాంగ్రెస్ నేతల తీరు
- ఆర్మూర్, కామారెడ్డిలో ముదిరిన వివాదం
- ఎమ్మెల్యేలను పట్టించుకోని యంత్రాంగం
- ప్రొటోకాల్‌ను కాదని కాంగ్రెస్సోళ్లకే పెద్దపీట
- ఉమ్మడి జిల్లాలో హస్తం నేతల హల్‌చల్

'ప్రజా పాలన' పేరు చెప్పి..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ నేతలంతా ఒకటే పాట పాడారు. ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని, ప్రజాస్వామ్యబద్ధ పాలన కొనసాగిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి సహా మంత్రులు, నాయకులు గొప్పలు చెప్పారు. కానీ అధికారం చేపట్టిన వెంటనే తమ నిజస్వ రూపం బయటపెట్టారు. ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసా వహించాల్సింది పోయి నియోజకవర్గాల్లో ప్రత్యామ్నాయ శక్తులను ఎగదోస్తున్నారు. ప్రత్యర్థి పార్టీల ఎమ్మెల్యేలను తక్కువ చేస్తూ తమ పార్టీ నేతలను ప్రోత్సహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో తొమ్మిది నియోజకవర్గాలు ఉండగా, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగు చోట్ల కాంగ్రెస్, మూడు చోట్ల బీజేపీ, రెండు స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధించింది. అయితే, బీఆర్ఎస్, బీజేపీ చేతిలో ఘోర పరాజయం పాలైన నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నేతలు అడ్డూ అదుపూ లేకుండా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో అధికారులను భయపెట్టి ఆధిపత్యం ప్రదర్శించాలని చూస్తున్నారు. తాము చెప్పినట్లే నడవాలని, తమ సమక్షంలోనే అధికారిక కార్యక్రమాలు నిర్వహించాలని యంత్రాంగంపై ఒత్తిడి తెస్తున్నారు. కొంత మంది నేతల వ్యవహార శైలి ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

ఇదేనా ప్రజా పాలన?

కామారెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గాల్లో ప'వార్' పాలిటిక్స్ తారాస్థాయికి చేరాయి. ఈ రెండు నియోజకవర్గాల్లో ఆధిపత్య పోరు స్పష్టంగా కనిపిస్తున్నది. ఆర్మూర్‌లో బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డిని కాదని, అనధికార వ్యక్తి అధికార దర్పం ప్రదర్శిస్తుండడం చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన వినయ్‌రెడ్డి అధికార దర్పాన్ని చలాయిస్తుండడం కొత్త వివాదానికి తెర లేపింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజు నుంచే పైడి రాకేశ్‌రెడ్డి ఈ వ్యవహారంపై మండిపడుతూ వస్తున్నారు. ఎమ్మెల్యేకు తెలియకుండానే నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు జరిగి పోతున్నాయి. ఆలూర్‌లో ఇటీవల జరిగిన ప్రారంభోత్సవ విషయంలోనూ ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వలేదు. వినయ్‌రెడ్డి తీరుపై గతంలోనే రాకేశ్‌రెడ్డి బహిరంగంగానే విమర్శలు చేశారు. పద్ధతి మార్చుకోవాలంటూ అల్టిమేటం జారీ చేశారు. 'బిడ్డా వినయ్ రెడ్డి.. జాగ్రత్త ' అంటూ హెచ్చరించారు.

> **ఎన్నికల్లో గెలవలేదు..** ఎలాంటి పదవీ లేదు.. అయినా కొందరు 'రాజ్యమేలుతున్నారు'. ఎలక్షన్లలో ఓడిపోయినా, ప్రజలు భీత్కరించినా అధికార దర్పం ప్రదర్శిస్తున్నారు. సర్కారు సహకారంతో ఆధిపత్యం చలాయించాలని చూస్తున్నారు. ప్రజల ఆశీర్వాదంతో గెలిచిన ఎమ్మెల్యేలను డమ్మీలుగా చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఫలితంగా నియోజకవర్గాల్లో వివాదాలు తలెత్తుతున్నాయి. ప్రొటోకాల్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ఇప్పటికే ఆర్మూర్, కామారెడ్డి నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి నెలకొన్నది. నిజామాబాద్ అర్బన్, బాల్కొండ, బాన్సువాడలోనూ ఇలాగే ఆధిపత్యం ప్రదర్శించేందుకు కొందరు ప్రయత్నిస్తుండడం విమర్శలకు తావిస్తున్నది. ప్రజా తీర్పును అపహాస్యం చేస్తున్న కాంగ్రెస్ తీరుపై జనం మండి పడుతున్నారు.
>
> –నిజామాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

ప్రజాస్వామ్యం ఖూనీ...

మొత్తంగా ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలకు విలువే లేదన్నది తేటతెల్లం అవుతోంది. స్వయంగా సీఎం చెప్పినప్పటికీ ఆయన ఆదేశాలను బేఖాతరు చేస్తూ కాంగ్రెస్ నేతలు అనధికారిక ఎమ్మెల్యేలుగా చలామణి అయ్యేందుకు ప్రయత్నిస్తుండడం విడ్డూరంగా మారింది. ప్రజా పాలన పేరిట పరిపాలనను మొదలు పెట్టిన కాంగ్రెస్ పార్టీ ఆ సిద్ధాంతాన్ని గాలికొదిలేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల తీర్పుతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పాలకులు ఆదర్శవంతమైన పరిపాలనతో మెప్పు పొందాలి కానీ ప్రజాస్వామ్య విలువలకు తిలోదాకలిస్తూ ఎమ్మెల్యేలను కాదని రాజ్యమేలడం సరికాదన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. కళ్ల ముందే ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరిగినా, అధికారులంతా అనధికారిక వ్యక్తులకు ఊడిగం చేస్తున్నా పట్టించుకోవాల్సిన ఉన్నతాధికారులు పెదవి విప్పకపోవడం విమర్శలకు తావిస్తున్నది. ఎమ్మెల్యేను కాదని ఇతర రాజకీయ నాయకుల చెంతకు పరుగులు తీసే అధికారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ కూడా వినిపిస్తున్నది.

కామారెడ్డిలో షబ్బీర్ అలీ హవా..?

కామారెడ్డి నియోజకవర్గంలోనూ ఆధిపత్య పోరు కొనసాగుతున్నది. ఇక్కడ బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిని కాదని కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీ హవా కొనసాగిస్తుండడం చర్చనీయాంశమైంది. నిజామాబాద్ అర్బన్‌లో ఓడిపోయిన షబ్బీర్ అలీని ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సలహాదారుగా నియమించింది. అయితే, తన సొంత నియోజకవర్గమైన కామారెడ్డిపై ఆయన ప్రధానంగా ఫోకస్ చేశారు. కీలకమైన పోస్టులో ఉన్న షబ్బీర్ అలీ.. ప్రభుత్వ దవాఖానలో జరిగిన ప్రారంభోత్సవ విషయంలో వ్యవహరించిన తీరు విమర్శలకు తావిస్తున్నది. స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని కాదని షబ్బీర్‌అలీతో ప్రారంభోత్సవం చేయించడంపై కాటిపల్లి బహిరంగంగానే మండిపడ్డారు. కామారెడ్డిని షబ్బీర్ అలీకి రాసిచ్చేశారా? అని అధికారులను నిలదీశారు. ఏ ప్రొటోకాల్ ప్రకారం షబ్బీర్‌అలీతో ప్రారంభిస్తారని ప్రశ్నించారు. మొత్తానికి నియోజకవర్గంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య రేగిన ఆధిపత్య పోరు ఇప్పట్లో చల్లారేలా లేదు.

మిగతా చోట్లా అంతే..

ఇక, బాన్సువాడలో ఏనుగు రవీందర్‌రెడ్డి సైతం అధికారులపై పరోక్షంగా ప్రభావం చూపుతుండడంతో పాటు ప్రత్యక్షంగానూ పలు కార్యక్రమాల్లో పాల్గొనడం వివాదం అవుతోంది. నిజామాబాద్ అర్బన్‌లో బీజేపీ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా గెలువగా, ఇక్కడ కాంగ్రెస్ ముఖ్య నేతల ప్రభావంతో ఎమ్మెల్యేను లెక్కలోకి తీసుకోవడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. బాల్కొండలోనూ ప్రొటోకాల్ విషయంలో ఇబ్బందులు సృష్టిస్తున్నారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన సునీల్‌రెడ్డి అంతా తానే అన్నట్లుగా ప్రవర్తించడం వివాదానికి దారి తీస్తోంది. అధికార కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, నేతల హడావుడి చూసి జనం ముక్కున వేలేసుకుంటున్నారు.

కళ్ల ముందే ఆగిపోతున్న 'అభివృద్ధి'

- కేసీఆర్ పాలనలో మంజూరైన పనులను రద్దుచేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోని రేవంత్ సర్కార్
- బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆవేదన
- కార్యకర్తలు, అభిమానుల మధ్య వేముల జన్మదిన వేడుకలు

వేములకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు

వేల్పూర్ ,మార్చి 14: గత కేసీఆర్ సర్కారు హయాంలో మంజూరైన పలు అభివృద్ధి పనులను అధికారంలోకి రాగానే కాంగ్రెస్ ప్రభుత్వం రద్దుచేసిందని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఇదే విషయమై పలుమార్లు అసెంబ్లీతోపాటు పలు వేదికల ద్వారాప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడంలేదన్నారు. బడి, గుడి, సంఘాలు ఏ ఒక్క పార్టీకి చెందినవి కావని, ఇందులో పార్టీలకు అతీతంగా పేదలందరూ లబ్ధి పొందుతారని చెప్పినా ప్రయోజనంలేకుండా పోయిందన్నారు. కండ్ల ముందే పేదలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు ఆగిపోతుంటే దుఃఖం వచ్చిందన్నారు. గురువారం వేముల తన జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు,అభిమానులతో కలిసి వేల్పూర్‌లో జరుపుకొన్నారు. తన నివాసంలో కేక్‌కట్ చేశారు.

వేములకు జన్మదిన కానుకగా అభివృద్ధి పనులకు నిధులు మంజూరుచేసిన ఎంపీ సంతోష్

వేములకు జన్మదిన కానుకగా ఎంపీ సంతోష్ కుమార్ వేల్పూర్ మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరుచేశారు.ప్రాథమిక పాఠశాలలో అదనపు గదులకు రూ.కోటీ 3లక్షలు, జడ్పీ ఉన్నత పాఠశాలలో అదనపు గదులకు రూ.20లక్షలు, ఇండోర్ స్టేడియం పనులకు రూ.35లక్షలు, ముదిరాజ్ సంఘ భవనానికి రూ.20 లక్షలు, మసీదులో టాయిలెట్స్ నిర్మాణానికి రూ.2లక్షలు,ఆల్ క్రిస్టియన్ గ్రేవ్ యార్డ్ నిర్మాణానికి రూ.5లక్షలు నిధులు మంజూరుచేయగా..ఇందుకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను ఎమ్మెల్యే వేముల అందజేశారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. పార్టీలు ముఖ్యంకాదని ప్రజల సంక్షేమం కోసం ప్రజాప్రతినిధులు పని చేయాలని సూచించారు. గతంలో మంజూరైన నిధులు కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయగానే తాను ఆవేదన చెందినట్లు తెలిపారు.

ఈ విషయమై తనకు అత్యంత ఆప్తుడు రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్‌తో చర్చించగా వెంటనే ఎంపీ నిధుల నుంచి రూ.కోటీ 93లక్షల నిధులు మంజూరు చేశారని వేముల చెప్పారు.

ఆటో డ్రైవర్ దంపతులకు కన్నీటి వీడ్కోలు..

వినాయక్‌నగర్, మార్చి 14: ఆటో సరిగ్గా నడవడం లేదని తీవ్ర మనస్తాపానికి గురై స్వామి అనే ఆటోడ్రైవర్ తన భార్యను చంపి, ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. బుధవారం చోటుచేసుకున్న ఈ సంఘటన జిల్లా కేంద్రంలో సంచలనం సృష్టించగా..రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దంపతులిద్దరు తనువు చాలించడంతో వారి ఒక్కాగా నొక్క కొడుకు ఒంటరివాడయ్యాడు. దంపతుల మృతదేహాలకు గురువారం అంత్యక్రియలు నిర్వహించగా.. కెనాల్ కట్ట ప్రాంతం నుంచి ఖిల్లా శ్మశాన వాటిక వరకు అంతిమయాత్ర నిర్వహించారు. ఒకే వాహనంపై స్వామి దంపతుల మృతదేహాలను ఉంచి చేపట్టిన అంతిమ యాత్రలో కుటుంబ సభ్యులతోపాటు సన్నిహితులు, కాలనీవాసులు, బంధువులు పాల్గొని కన్నీరుమున్నీరుగా విలపించారు. గుండెలవిసేలా రోదించిన కొడుకు మల్లికార్జున్‌ను చూసిన ప్రతి ఒక్కరి హృదయం ద్రవించింది. తల్లిదండ్రులను కోల్పోయి, ఎవరూలేక అనాథగా మారిన మల్లికార్జున్‌ను ఎవరైనా ఆదుకోవాలని అతడి మేనమామ ఒగ్గు మధు కోరాడు.

నేను యాడికిపోవాలి..

'అమ్మా నాన్న.. ఇక నాకు దిక్కెవరు.. నన్ను ఒంటరివాడిని చేసి వెళ్లిపోయారు..నన్ను చేరదీసేవారెవరు..నాకు దిక్కేంది.. తొవ్వేంది.. నాకు తోబుట్టువులు కూడా లేరు.. ఎవరి చెంతకు వెళ్లాలి..' అంటూ తల్లిదండ్రులను తలుచుకుంటూ కొడుకు మల్లికార్జున్ బోరున విలపించాడు. 'నన్ను ఎవరైనా ఒక్కరోజు జూత్తరు..రెండు రోజులు చూస్తరు..మూడోన్నాడు గెంటేస్తే నేను యాడికిపోవాలి..' అంటూ విలపించడం అక్కడున్నవారిని కదలించింది.

ఇంటికెళ్లేటి..

ఫిబ్రవరి 29 నుంచి ప్రారంభమైన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారంతో ముగిశాయి. ఇంతకాలం పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు పరీక్షలు ముగియడంతో ఆనందంతో ఇంటిబాట పట్టారు. ఉమ్మడి జిల్లాలోని పరీక్షా కేంద్రాలతోపాటు కళాశాలలు, వసతి గృహాల్లో విద్యార్థుల కేరింతలతో సందడి వాతావరణం నెలకొన్నది. స్నేహితులతో సెల్ఫీలు, ఆటోగ్రాఫ్‌లు తీసుకుంటూ బైబై చెప్పుకొన్నారు. విద్యార్థులు స్వస్థలాలకు తరలివెళ్లడంతో వారి తల్లిదండ్రులు, బంధువులతో బస్టాండ్ల వద్ద రద్దీ ఏర్పడింది.
-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

ఎంపీ ఎన్నికల్లో ఇతర పార్టీలకు ముచ్చెమటలు ఖాయం

- మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి


పోచారానికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అనిల్‌కుమార్

బాన్సువాడ టౌన్, మార్చి 14: నిస్వార్థమైన కార్యకర్తలు తోడు ఉండగా ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనే సత్తా బీఆర్ఎస్‌కు ఉన్నదని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ గురువారం ఎమ్మెల్యే పోచారాన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థిగా ఎంపికైన అనిల్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజకీయంపై పూర్తి అవగాహన లేని కొందరు పార్టీ నుంచి వెళ్లినంత మాత్రాన పార్టీకి జరిగే నష్టమేమీ లేదని, చెత్తంతా పోగా నిజమైన కార్యకర్తలు, నాయకులు పార్టీకి ఎళ్లవేళలా అండగా ఉంటారని అన్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో బాన్సువాడ నియోజకవర్గ మెజారిటీతోనే గెలుపొందామని, వచ్చే ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపుకోసం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు కలిసిమెలిసి పనిచేయాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని కాంగ్రెస్‌కు, మతపరమైన ద్వేషాలను రెచ్చగొడుతూ పబ్బం గడిపే బీజేపీకి ముచ్చెమటలు పట్టడం ఖాయమన్నారు.

గంపను కలిసిన గాలి అనిల్‌కుమార్..


కామారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు అందజేస్తూ..

కామారెడ్డి,మార్చి 14: కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్‌ను జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ గురువారం కలిశారు. తన విజయానికి సహకరించాలని కోరారు.

ఏటీఎంలో భారీ చోరీ

- సీసీ కెమెరాలపై బ్లాక్ కలర్ స్ప్రే..
- రూ.20 లక్షల నగదు అపహరణ
- రుద్రూర్ మండల కేంద్రంలో ఘటన

ఏటీఎంను ధ్వంసం చేసిన దుండగులు

రుద్రూర్, మార్చి14: రుద్రూర్ మండల కేంద్రంలో భారీ చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు ఎస్‌బీఐ ఏటీఎంను ధ్వంసం చేసి రూ.20 లక్షలను ఎత్తుకెళ్లారు. ఈ ఘటన బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రూర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి ఏటీఎం వెలుపలతోపాటు లోపల ఉన్న సీసీ కెమెరాలపై బ్లాక్ కలర్ పెయింట్‌ను స్ప్రే చేశారు. అనంతరం లోపలికి చొరబడి ఏటీఎంను బయటికి తీసుకువచ్చి ధ్వంసం చేశారు. అందులో ఉన్న రూ.20 లక్షలను అపహరించుకుపోయారు. తమ పుటేజీ రికార్డు కాకుండా ఏటీఎం ఇరువైపులా ఉన్న సీసీ కెమెరాలకు సైతం బ్లాక్ కలర్ స్ప్రే చేశారు. గురువారం ఉదయం సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఏటీఎం సమీపంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా.. దుండగులు వాహనంలో వచ్చి చోరీకి వచ్చినట్లు గుర్తించారు. సీఐ జయేశ్‌రెడ్డి పరిసర ప్రాంతాలను పరిశీలించి, ఎస్‌బీఐ అధికారులకు సమాచారం అందించారు. ఏసీపీ శ్రీనివాస్ అక్కడికి చేరుకొని వివరాల సేకరించారు. బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఏసీపీ తెలిపారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

- ప్రభుత్వ బడుల నిర్వహణ బాధ్యతలు మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగింత
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

కామారెడ్డి/ కంఠేశ్వర్, మార్చి 14: 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ'లతో ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. గురువారం ఆమె హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతలను స్వశక్తి మహిళా సంఘాలకు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గ్రామంలో 23 మహిళా సంఘాలు ఉంటే పాఠశాలకు దగ్గరగా ఉన్న మహిళా సంఘానికి మొదటి సంవత్సరం అవకాశం కల్పించాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో చేపట్టాల్సిన పనులను గుర్తించి కలెక్టర్లు వెంటనే పరిపాలన అనుమతులు మంజూరు చేసి జిల్లా సమాఖ్యకు అప్పగించాలని ఆదేశించారు. కామారెడ్డిలో కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, సీపీవో రాజారాం, డీఆర్డీవో చందర్ నాయక్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిణి రజిత, నిజామాబాద్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ అంకిత్, డీఈవో దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.